ప్రజాశక్తి

ఆదివారం 9 మార్చి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తేనె మంచు ముప్పు

◆ ఈ ఏడాదీ తగ్గనున్న మామిడి, జీడి దిగుబడులు ◆ ఆందోళనలో రైతు



మాడిపోతున్న మామిడి పిందెలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో మామిడి, జీడి మామిడి రైతులకు ఈ ఏడాదీ ప్రతికూలంగానే వుంది. పూత బాగుందన్న సంతృప్తి వారిలో ఎంతో కాలం నిలవలేదు. పొగమంచు, తేనెమంచు, తామర పురుగు వంటి పలు కీటకాలు పిందె దశలో దాడిచేయడంతో రైతులు అదనంగా పెట్టుబడులు పెట్టాల్సివస్తోంది. అయినా సాధారణ దిగుబడులు వస్తాయన్న ఆశలేదు. సగటు దిగుబడుల కంటే తక్కువ వస్తే రైతుకు నష్టం జరగనుంది. జిల్లాలో 70 వేల ఎకరాల్లో జీడి మామిడి, 20 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. మరో పంట సాగుచేయడానికి వీల్లేని మెట్ట ప్రాంతాల్లో జీడి, మామిడి తోటలకు రైతులు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పంట చేతికి రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి ప్రతికూలతలు లేకపోతే పంట కొంత లాభదాయకంగా ఉంటుంది. కానీ ఈ ఏడాది కురుస్తున్న తేనె మంచుతో అధికంగా సాగుచేసే జీడితోటల పిందెలు రాలిపోతున్నాయి. సకాలంలో రక్షణ చర్యలు చేపట్టకపోతే రైతులు భారీగా నష్టపోనున్నారు.

జిల్లాలో సబ్బవరం, కె.కోటపాడు, చోడవరం, బుచ్చెయ్యపేట, మాకవరపాలెం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల మండలాల్లో అధికంగా మామిడి తోటల సాగు వుంది. ఇతర మండలాల్లో కూడా సాగునీటి సౌకర్యంలేని మెట్ట మిగతా 2లో..

సస్యరక్షణతో దిగుబడులు



మామిడి పిందె దశలో రెండో దఫా తేనె మంచు పురుగు, తామర పురుగు నివారణకు శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారుల సూచనల ప్రకారం మందులు ఉపయోగించాలి. నాణ్యమైన పండ్ల దిగుబడికి కాయ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు పండ్ల కవర్లను తొడగాలి. అధికంగా పూత, పిందె రాలుతున్నప్పుడు ప్లానోఫిక్స్ 2 మిల్లీలీటర్లు.. 10 లీటర్ల నీటికి కలిపి డోసు ఎక్కువ కాకుండా, వేరే ఇతర మందులతో కలపకుండా ఉదయం, సాయంత్రపు సమయాల్లో పిచికారీ చేయాలి. జీవన ఎరువులను 250 గ్రాముల చొప్పున పశువుల ఎరువులో కలిపి వాడుకోవడం ద్వారా మొక్కకు పోషకాల లభ్యతను పెంచవచ్చు. కాయ పెరిగే దశలో పిచికారీ చేసినచో కాయ ఎదుగుదలకు తోడ్పడుతుంది.

– జి.ప్రభాకరరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

మహిళల భద్రతకు ప్రాధాన్యత

ఉమెన్స్ డే వేడుకల్లో మంత్రులు డోలా, అనిత, కొల్లు, స్పీకర్ అయ్యన్న



మహిళలకు ద్విచక్ర వాహనాలు అందిస్తున్న మంత్రి డోలా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ/ అనకాపల్లి విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో జరిగిన వేడుకల్లో వారు పాల్గొన్నారు. మహిళలను సత్కరించారు.

విశాఖలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన వేడుకలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, వికలాంగులు, సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం పరిధిలో విజయాలు సాధించిన మహిళలను గుర్తించి, వారిని గౌరవించి, ఆర్థికంగా అభివద్ధి చెందడానికి ప్రోత్సహించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ద్వారా ప్రతి ఒక్క మహిళా ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, సిపి శంఖబ్రాత బాగ్చి రాష్ట్ర సహకార ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ గండి బాబ్జి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ ఎం.రామలక్ష్మి, మిగతా 2లో..



మహిళా కానిస్టేబుల్‌ను సత్కరిస్తున్న మంత్రి అనిత

రోప్ వే నిర్వాహకులకు నోటీసులు

▶ వార్త 3లో..

యుబిఐ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

▶ వార్త 5లో..

జీడి పిక్కలకు గిట్టుబాటు ధర ప్రకటించాలి

▶ వార్త 8లో..



తిమ్మరాజుపేటలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు ప్రారంభం

జనం కష్టాలను తెలుసుకుంటూ ముందుకు...

వార్త 5లో..

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ల ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని, ఇలాంటి వేదికలను కక్షిదారులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని విశాఖ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకుగాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిత్యం పని చేస్తోందని గుర్తు చేశారు. జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ వద్ద శనివారం జరిగింది. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలన్నదే న్యాయ వ్యవస్థ అంతిమ లక్ష్యమని, ఆ దిశగా న్యాయమూర్తులు సేవలందిస్తున్నారని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాధితులకు అండగా నిలుస్తూ న్యాయ సహాయం అందిస్తోందని అన్నారు. లోక్ అదాలత్ లాంటి వేదికల్లో పౌర శిక్షాస్మృతి, నేర శిక్షా స్మృతి పరిధిలోని రాజీకాగలిగిన కేసులు, మోటారు ప్రమాదాల కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, మిగతా 2లో..

కెజిహెచ్ పిఐసియులో అధునాతన సదుపాయాలు

పిల్లల అత్యవసర చికిత్సల్లో సరికొత్త మైలురాయి



అధునాతన సౌకర్యాలు కల్పించిన వార్డులో శివానంద

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో పిల్లల అత్యవసర చికిత్స విభాగం (పిఐసియు)లో అత్యాధునిక పిల్లల అల్ట్రాసౌండ్, 2డి ఈకో ప్రోబ్‌ను శనివారం ఏర్పాటు చేశారు. వాటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, పిడియాట్రిక్ విభాగ అధిపతి డాక్టర్ బిఎస్.చక్రవర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సౌకర్యం పిల్లల అత్యవసర వైద్యంలో విప్లవాత్మక మార్పు తీసుకురావడమే కాకుండా క్షణాల్లో వ్యాధిని నిర్ధారణ చేయడం, ఉత్తమ చికిత్స అందించడం, రోగుల ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో కీలకంగా వ్యవహరిస్తుందని తెలిపారు. పాయింట్-ఆఫ్-కేర్ అల్ట్రాసౌండ్ (పిఒసియుఎస్) సౌకర్యం ద్వారా తమ పిఐసియు వైద్య బృందం ఇప్పటి నుంచి నిర్వహించే వివిధ పరీక్షల గురించి తెలిపారు. రక్తనాళాల స్థితి అంచనా, షాక్, కష్టతరమైన ఐవి యాక్సెస్, ఐవిసి స్థితిని అంచనా వేయడానికి తాజా ఏర్పాట్లు కీలకంగా మారుతాయన్నారు. హృదయ సంబంధిత పరీక్షలు, హృదయ కార్యకలాపాలను అంచనా వేయడానికి, పరికార్డియల్ ఎఫ్యూషన్ హీమోడైనమిక్ అస్థిరతను గుర్తించడానికి తక్షణ ఈకోకార్డియోగ్రఫీని అందిస్తుందన్నారు. ఊపిరితిత్తుల వ్యాధి పరిశీలన, ప్లీయురల్ ఎఫ్యూషన్, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు, న్యూమోథోరాక్స్‌ను గుర్తించడానికి ఉపయోగపడుతుందన్నారు. నవజాత శిశువులలో మెదడు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తేనె మంచు ముప్పు

ప్రాంతాల్లో మామిడి తోటలను ప్రధాన ఆదాయ వనరుగా రైతులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎకరాకు సగటున నాలుగు టన్నులు మామిడి దిగుబడి వస్తుందని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. మామిడి ప్రస్తుతం పూత దశ నుంచి కాయ దశకు చేరుకోవడంతో దిగుబడులపై పెద్ద ప్రభావం పడనప్పటికీ, కాయలు గరుకుగా వుండడంతో వాటి నాణ్యత దెబ్బతిని, సరైన ధర రైతుకు రాకుండా పోతుంది. పూత దశలోని తోట పూతరాలడంతో నష్టం ఎక్కువగా వుంటుంది. టి దోమతో జీడి మామిడి పూత మాడటం, పిందెల రసం పీల్చడం వల్ల పిందెలు కిందపడటం జరుగుతాయి. అత్యధికంగా నాతవరం, రోలుగుంట, నర్సీపట్నం, రావికమతం, గొలుగొండ, చీడికాడ, దేవరాపల్లి, రాంబిల్లి, యలమంచిలి మండలాల్లో జీడి మామిడి సాగవుతోంది. సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే ఎకరాకు ఐదారు బస్తాలు వచ్చే దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. మామిడి, జీడి మామిడి తోటలు తెగుళ్లు, ఇతర కీటకాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు పలు సూచనలు చేస్తున్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత

మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జి.చిన్నయిదేవి పాల్గొన్నారు. మహిళలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలను మంత్రి పంపిణీ చేశారు.



మహిళా అధికారులను సత్కరిస్తున్న కొల్లు, అయ్యన్న తదితరులు

మహిళా పోలీసుకు సత్కారం

ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ వి.రేవతిని హోం మంత్రి అనిత శనివారం ఘనంగా సత్కరించారు. శివాజీపాలెంలో నివసిస్తున్న సదరు కానిస్టేబుల్ ఎనిమిదో నెల గర్భిణీ కావడంతో హోంమంత్రినే స్వయంగా ఆమె ఇంటికి వెళ్లారు.

అనకాపల్లిలో..

మహిళలు ఉత్పాదక యూనిట్లు స్థాపించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని రాష్ట్ర అబ్కారీ, భూగర్భ గనుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాలులో శనివారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి మహిళా దినోత్సవ కార్యక్రమానికి శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంటు సభ్యులు సిఎం.రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రతి ఇంటిలో కుటుంబాన్ని తీర్చిదిద్దేది మహిళేనని తెలిపారు. శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి తుహిన్ సిన్హా, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద సత్యనారాయణ, ఎమ్.సురేంద్ర, ప్రగడ నాగేశ్వరరావు, పివిజి.కుమార్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా మహిళలకు రుణాలు, ఆస్తులు పంపిణీ చేశారు. పలువురిని సత్కరించారు.

కెజిహెచ్ పిఐసియులో అధునాతన సదుపాయాలు

వ్యాధులను నిర్ధారించడంలో సహాయపడుతుందని, ఆకస్మిక కడుపు నొప్పి, అసిటిస్, కాలేయ సంబంధిత సమస్యలు, ప్రేగు వ్యాధులను బెడ్‌సైడ్ వద్దే పరీక్షించగలదన్నారు. ఈ సౌకర్యం ఒక గేమ్ చేంజర్‌గా మారనుందని తెలిపారు. ఇది రేడియాలజీపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు అత్యవసర పరిస్థితులలో రోగులను తరలించాల్సిన అవసరాన్ని తగ్గిస్తుందని తెలిపారు. క్షణాల్లో నిర్ధారణ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం పెరుగుతుందన్నారు. ఈ విశిష్ట సౌకర్యాన్ని ఏర్పాటు చేయడంలో డాక్టర్ బుజ్జిబాబు (రేడియాలజీ విభాగాధిపతి) సహకారం ఎనలేనిదన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న గిరిధర్

సివిల్ కేసులు పరిష్కారానికి వస్తాయన్నారు. ప్రభుత్వ సంస్థలు, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు, కక్షిదారులు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు. శనివారం అన్ని జిల్లా కోర్టుల్లో మోటార్ యాక్సిడెంట్ కేసులు మొత్తం 142 రాజీకాగా, నష్ట పరిహారం రూ.11,76,13,000 ఇవ్వబడిందని తెలిపారు. మొత్తం సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించడమైందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ, మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.రాధారత్నం, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, ఏపి బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ ఎస్.కృష్ణమోహన్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

అయోధ్యరామ్‌కు ఇచ్చిన

షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్‌కు ఉక్కు యాజమాన్యం షోకాజ్ నోటీసు ఇవ్వడాన్ని సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. తక్షణమే షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించిన నాటి నుంచి విశాఖతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాడుతోందన్నారు. ఫలితంగా ప్రైవేటీకరణ తాత్కాలికంగా ఆగిందన్నారు. ప్లాంట్‌పై నేటికీ కుట్రలు కొనసాగుతున్నాయని, జీతాలు నిలుపుదల, టౌన్‌షిప్‌లో విద్యుత్ ఛార్జీల పెంపు, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు వంటివి ఈ నేపథ్యంలోనివేనని తెలిపారు. యాజమాన్యం తీసుకున్నటువంటి ఈ దుర్మార్గ చర్యలపై మాట్లాడారనే నెపంతో అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడం దారుణమన్నారు. ఇలాంటి చర్యలేవీ పోరాటాలను ఆపలేవన్నారు. త్యాగాలతో సాధించుకున్నటువంటి స్టీల్ ప్లాంట్‌ను మరిన్ని త్యాగాలతో నిలబెట్టుకుంటామన్నారు. అందులో భాగంగానే ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు జరుగుతాయని తెలిపారు. వాటిని జయప్రదం చేయాలని కోరారు.

అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడాన్ని హిందూస్తాన్ షిప్ యార్డ్‌లోని సిఐటియు విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బిఎస్ఎన్.రాజు, ఎస్.ప్రసాద్ ఖండించారు.

గాజువాక : అయోధ్యరామ్‌కు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని భెల్ సిఐటియు నాయకులు జిటిపి.ప్రకాష్, ఎస్.జగన్నాధరావు, కె.నారపరెడ్డి, కె.విజయ్‌కుమార్, పి.కనకరావు, అల్లి అప్పలనారాయణ, ఎస్.అప్పారావు, జి.అచ్చన్న నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఉగాది సంప్రదాయ వస్త్రాల ప్రదర్శన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉగాది పండగను పురస్కరించుకుని విస్తృత శ్రేణిలో సంప్రదాయ వస్త్రాల ప్రదర్శనను హోటల్ గ్రీన్ పార్కులో శనివారం ప్రారంభించారు. ఈ హ్యాండ్ టు హ్యాండ్ ఎగ్జిబిషన్, సేల్ ఎక్స్‌పో ఈ నెల 12వ తేదీ వరకూ కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు. ఉగాది పండగకు అన్ని రకాల సంప్రదాయ దుస్తులను, ఫ్యాషన్ వస్త్రాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామన్నారు. అనేక రకాల ఉపకరణాలూ లభిస్తాయన్నారు. ఆకర్షణీయమైన విభిన్న రంగులు, డిజైన్లలో దుస్తులు సందర్శకులను ఆకట్టుకుంటాయన్నారు. ఉగాది, వివాహాల కాలం కావటం వల్ల అందుకు అవసరమైన పట్టుచీరలు, కాటన్ వస్త్రాలు, సల్వార్లు, టాప్స్ వంటి వాటితో సహా అనేక రకాల సంప్రదాయ వస్త్రాలను ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. పోచంపల్లి, కలంకారీ చీరలు, సంప్రదాయ కోల్‌కతా, భాగల్‌పురి ప్రింట్లు, లక్నో చికెన్ వర్క్ చీరలు, బనారస్ పట్టు చీరలు మాత్రమేకాక మగ్గాల పైన నేసిన, రంగులు వేసిన, ముద్రించిన, ఎంబ్రాయిడరీ చేసిన విశిష్టమైన వస్త్రాలు అన్నీ ఒకేచోట అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విజయం ఏ పక్షం ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పెద్దల సభ ఎన్నిక ఫలితం ఒకింత ఆందోళన, ఆవేదన మిగిల్చింది. ఇది జయాపజయాల వైపు నుంచి చూసి పడుతున్న ఆందోళన కాదు. ఆవేదన అంతకంటే కాదు. సభ ఔన్నత్యం, గౌరవ, మర్యాదలు ఏమవుతాయోనని మదనపడుతున్న పరిణామాలు చోటుచేసుకోవడం ఇందుకు ప్రధాన కారణం. కూటమిలోని మూడు భాగస్వామ్య పార్టీలు ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో రెండుగా విడిపోయి తమ మాట జవదాటని వ్యక్తుల విజయానికి బరితెగించి పనిచేశాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిరంజీవిరావుకు సహకరించిన సిట్టింగ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మకు టిడిపి, జనసేన అన్ని రకాల సహాయమందించాయి. పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనువాసులు నాయుడుకు బిజెపి బహిరంగంగానే పనిచేసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో మాధవ్‌కు పనిచేసిన గాదె రుణం తీర్చుకోడానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బిజెపి సహాయపడింది. కూటమి మూడు పార్టీలు ఇద్దరి అభ్యర్థుల కోసం వేర్వేరుగా పనిచేశాయి. గెలిచిన గాదెను కూటమి ఎమ్మెల్సీగానే ముఖ్యమంత్రి చంద్రబాబుకు బిజెపి నాయకులు పరిచయం చేసినట్లు ప్రచారం సాగింది. ఈ పరిచయంలో గాదె స్వతంత్రను కోల్పోయి వ్యవహరించిన తీరు గెలిపించిన వారిని బాధిస్తోంది. బాబు దగ్గర ఆయన చూపిన వినమ్రత, విధేయత విమర్శలకు దారితీయడమేకాదు, పదవీకాలమంతా తలవంచుకొని వుంటానని చెప్పినట్లుంది.

తాము బలపర్చిన రఘువర్మ ఓటమిపాలైనా, తమ మాట జవదాటని గాదె గెలుపైనా టిడిపికి సమస్య కాదు. రఘువర్మ, గాదె శ్రీనివాసులునాయుడులో ఎవరు గెలిచినా కూటమి బలపర్చిన వారే గనుక ఇముడ్చుకోవడానికి దానికి శషభిషలుండవు. దానికి కావాల్సిందల్లా ప్రభుత్వ విద్యను బలహీనంచేసే విధానాలు, పద్ధతులను వ్యతిరేకించకుండా వుంటేచాలు. ప్రభుత్వ విద్యా



విధాన పర్యవసానాలు, ప్రమాదాలపై మాట్లాడకుండా తలూపే వారెవరు గెలిచినా పరవాలేదనుకుంది. తమను సమర్థించేవారు గెలిస్తే చాలనుకుంది. ప్రభుత్వ తప్పుడు విద్యా విధానాలను ప్రశ్నించినవారు గెలవకుండా, శాసన మండలిలో అడుగుపెట్టకుండా వుంటేచాలని సాధారణ ఎన్నికలను తలపించేలా పరువు, మర్యాదలు వదిలి కూటమి పనిచేసింది. మహిళైనా గొంతున్న విజయగౌరి గెలవకూడదని తమ పార్టీ నాయకత్వాన్ని పనిలోకి దించింది.

కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు వాంఛించినట్లు తాము కోరుకునే వ్యక్తుల్లో ఒకరైన గాదె గెలిచారు. పెద్దల సభ హుందాతనం దెబ్బతీసేలా అధికార కూటమి వ్యవహరించింది. సాధారణ ఎన్నికల వలె ప్రలోభపర్చే ప్రయత్నం, ప్రచారం ఎన్నికల ఆది నుంచి చివరి వరకు సాగించింది. ప్రభుత్వ పాచికలు ఎలా వున్నా... ప్రభుత్వ విద్య పరిరక్షణకు నిరంతరం పోరాడుతున్న యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఓటమి ఉపాధ్యాయులకు, ప్రభుత్వ విద్య బలోపేతం కావాలని కోరుకునే వ్యక్తులు, శక్తులకు విచారాన్ని మిగిల్చింది. ప్రభుత్వం బలపర్చిన రఘువర్మను ఓడించి కూటమి ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను చాటుకోవడంలో ఉపాధ్యాయులు చైతన్యం ప్రదర్శించారు. ప్రభుత్వ విద్య రక్షణ, ఉపాధ్యాయ, అధ్యాపకుల హక్కులు, సంక్షేమం, శ్రేయస్సు కోసం పరితపించి పనిచేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి విజయానికి ఆ చైతన్యం మరింత తోడైతే ఉత్తరాంధ్ర స్వరం శాసన మండలిలో ప్రతిధ్వనించేది.

డిగ్రీ కళాశాలలో అరకొర సదుపాయాలు

విద్యార్థుల అవస్థలు
దాతల సాయంతో కుర్చీలు


అరకొర వసతుల మధ్య తరగతి గదిలో విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకొర సదుపాయాలు నెలకొన్నాయి. దీంతో విద్యార్థులే గాకుండా అధ్యాపకులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. 2019లో ఇక్కడ మంజూరైన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2021 నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 29 మంది విద్యార్థినులతో ప్రారంభమైన కళాశాలలో ప్రస్తుతం 78 మంది విద్యార్థులు, 36 మంది విద్యార్థినులు ఉన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు జివిఎంసి ఒకటో వార్డు పరిధి చిట్టివలస కొండపేట వద్ద ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 2022 వరకు కళాశాలను నిర్వహించారు. ఇదే ప్రాంగణంలో నిర్మితమై ఉన్న కెజిబివి 4వ టైప్ భవనంలో 2023 నుంచి డిగ్రీ కళాశాల నడుస్తోంది. 2019లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా కళాశాలగా ప్రారంభమై అనంతరం బాలురకు కూడా ప్రవేశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

అరకొర సదుపాయాలు...

ఈ కళాశాలలో 78 మంది బాలురు, 36 మంది బాలికలు చదువుతున్నారు. నూతన విద్యా విధానం ప్రకారం బోటనీ, జువాలజీ, మేథ్స్, బి.కామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, హిస్టరీ, కెమిస్ట్రీ కోర్సులున్నాయి. ఇక్కడ కేవలం 8 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఈ గదుల్లో ఫర్నిచర్ లేనే లేదు. దాదాపు 6 నెలల క్రితం వరకు నేలపైనే కూర్చుని విద్యార్థులు చదువుకునే వారు. ప్రిన్సిపల్, అధ్యాపకుల విజ్ఞప్తి మేరకు కొంతమంది దాతలు ముందుకొచ్చి ప్లాస్టిక్ కుర్చీలు ఏర్పాటుచేశారు. గతేడాది అక్టోబర్ వరకు విద్యుత్ సదుపాయం కూడా లేదు.

అధ్యాపకులూ అరకొరే...

114 మంది విద్యార్థులకు పాఠాలు బోధించే అధ్యాపకులు కూడా అరకొరగానే ఉన్నారు. ముగ్గురు కాంట్రాక్టు అధ్యాపకులు మేథ్స్, కెమిస్ట్రీ, కామర్స్ చెప్తున్నారు. ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నప్పటికీ ఇందులో ప్రస్తుత ప్రిన్సిపల్ బోటనీ చెప్తున్నారు. ఇంకొకరు 2023 ఆగస్టు నుంచి అమరావతిలో డైరెక్టర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్‌లో ఓడిగా ఉంటున్నారు. 2019లో సూపర్ న్యూమరరీ పోస్టులను గత ప్రభుత్వం క్రియేట్ చేయడంతో అప్పటి నుంచి జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తున్నారు. అటెండర్ ఊసే లేదు.

ఇక్కడ కాలేజీ ప్రారంభించిన తర్వాత 2021 బ్యాచ్ బాలికలు డిగ్రీ పూర్తి చేసి బయటకు వెళ్లారు. బాలికలకు మాత్రమే 4 బాత్ రూమ్‌లున్నాయి. బాలురు, కొంతమంది అధ్యాపకులు అవసరాలు తీర్చుకునేందుకు ఆరు బయటకు వెళ్లాల్సిందే మరి.

ఇక్కడ ప్రయోగశాల లేదు. దీని కోసం విశాఖ నగరంలో ఉన్న ప్రభుత్వ కృష్ణా డిగ్రీ కళాశాలకు విద్యార్థులను తీసుకెళ్తుంటారు. మోటారు ఉన్నప్పటికీ వచ్చే నీరు తాగేందుకు పనికి రాదు. రోజు వారీ తాగు నీరు మొదలు బ్లాక్ బోర్డులు, సుద్ద ముక్కల వరకు ప్రిన్సిపల్, అధ్యాపకులే సొంత డబ్బులతో సమకూరుస్తున్నారు. తన అవసరాలకు కొనుక్కున్న ల్యాప్‌టాప్‌ను విద్యార్థుల కోసం ప్రిన్సిపల్ వినియోగిస్తున్నారు. ఇంటర్నెట్ కనెక్షన్ కూడా ప్రిన్సిపల్ పెట్టించారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం. 29 మంది విద్యార్థినులతో ప్రారంభించబడిన ఈ కళాశాల ప్రస్తుతం 114 మందితో నడుస్తుంది.


డాక్టర్ పి.శ్రీవాణి
ప్రిన్సిపల్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
తగరపువలస

నేరాలు ఘోరాలు

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-పెందుర్తి : వేపగుంట దరి సింహపురి కాలనీలోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టుచేశారు. వారి నుంచి రూ.10,500 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసామని సిఐ సతీష్‌కుమార్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చీడిక కొత్తూరు గ్రామంలో సోమవారం పేకాట శిబిరంపై దాడి చేసినట్లు సిఐ కుమారస్వామి తెలిపారు. ఈ దాడిలో 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసే వారి వద్ద నుండి రూ.65,250లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం గ్రామంలో శనివారం స్కూటీపై తరలిస్తున్న 22 కేజీల గంజాయిని పట్టుకున్నామని కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి స్కూటీపై తుని వరకు వెళ్లి అక్కడ నుంచి బెంగుళూరుకు ట్రైన్‌లో రవాణా చేసేందుకు అనంతపురం జిల్లాకు చెందిన పి.మనోహర్, అల్లూరి జిల్లా జీకేవీధి మండలంకు చెందిన కంకిపాటి రామలింగంపడాల్‌లు వెళుతుండగా పట్టుకున్నామని చెప్పారు. ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద స్కూటీతో పాటు మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.


మహిళా సాధికారత భవనం ప్రారంభంలో ఎమ్మెల్యే వెలగపూడి

మహిళా సాధికారత భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి ఆదర్శనగర్‌లోని జివిఎంసి కాంప్లెక్స్‌లో మహిళా సాధికారత, కుట్టు మిషన్ శిక్షణా భవనాలను శనివారం వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలిసి స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ఈ భవనాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కుట్టు శిక్షణా తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, జెడ్పీ కనకమహాలక్ష్మి, ఈఈ శాంతరాజు, ఏఈ వెంకటరావు, వార్డు టిడిపి అధ్యక్షులు గాదు అప్పలనాయుడు, మద్దిల రాజేష్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'గాయత్రి' ప్రతిభ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసిన 3, 5వ సెమిస్టర్ల ఫలితాల్లో ఆనందపురం గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రధానాచార్యులు దుక్క అప్పలరాజు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ బెల్లం రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల నిరంతర అభ్యసన ద్వారా మంచి మార్కులను సాధించవచ్చున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలంటే డిగ్రీ స్థాయి నుంచి సబ్జెక్ట్‌పై నిరంతర సాధన అవసరమని చెప్పారు. అనంతరం 3వ సెమిస్టర్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన కడియం దేవి (బిఎస్‌సి), ద్వితీయస్థానంలో నిలిచిన కొట్యాడ రమ్య (బిఎస్‌సి), తృతీయ స్థానంలో నిలిచిన లంక విష్ణుకుమార్‌ను, 5వ సెమిస్టర్‌లో మొదటి స్థానంలో నిలిచిన తమ్మిన గణేష్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బూర్ల సాయిలక్ష్మి, దుక్క పావనిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.సునీత, టి.పద్మ, సూర్యకుమారి, బంటుబిల్లి సత్యనారాయణ, తాతారావు, అఖిల, ఈశ్వరరావు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న గాయత్రి కళాశాల ప్రతినిధులు

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలో ఉన్న రైతులకు సబ్సిడీ ధరకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేయనున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. భీమిలి మండలానికి 76, ఆనందపురం మండలానికి 76, పద్మనాభం మండలానికి 105 పరికరాలు సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పవర్ టిల్లర్లు, బ్రష్ కట్టర్లు, పవర్ వీడర్లు, రోటా వేటర్లు, ట్రాక్టర్ పనిముట్లు, పవరు స్ప్రేయర్లు, బ్యాటరీ, చేతి పంపులు అందజేస్తామని తెలిపారు. ఈ పరికరాలు కావాల్సిన వారు పట్టాదారు పాసు పుస్తకం, పాస్‌ఫోటో, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్, గత మూడేళ్లలో రైతు పేరుతో ఈ పంట తప్పని సరిగా నమోదై ఉండాలని, గత మూడేళ్లలో ఎప్పుడైనా భూసార పరీక్ష కార్డు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు కుల ధ్రువీకరణ పత్రం ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత పత్రాలతో రైతు సేవా కేంద్రం ఇన్చార్జిని సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన తదుపరి మొబైల్ ఫోన్‌కు వచ్చిన మేసేజ్ ద్వారా ఎంత మేరకు సబ్సిడీ వచ్చిందీ, రైతు చెల్లించాల్సిన వాటా ఎంత తెలుస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-మధురవాడ : పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధి ఐటి సెజ్ ఏరియాలోని హిల్ నెంబర్ 1, 2, 3పై ఉన్న అన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వాటి చుట్టుపక్కల ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు పిఎం.పాలెం సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలూ జరగకుండా పోలీస్ గస్తీని ముమ్మరం చేశామని, పోలీస్ సిబ్బంది 3 వాహనాలతో 24గంటల నిఘా ఉంటుందని పేర్కొన్నారు. బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం, బైక్ రేసింగ్‌లు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం తదితరాలకు ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కరోనాలో అమలుచేసిన జీతాలివ్వాలి



సమస్యలపై ధర్నా చేస్తున్న శానిటేషన్ కార్మికులు

విమ్స్ కాంట్రాక్టు శానిటరీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ కాంట్రాక్టు శానిటరీ కార్మికులకు కరోనాలో అమలుచేసిన జీతాలను చెల్లించాలని కోరుతూ శనివారం విమ్స్ ఆసుపత్రి కాంట్రాక్టు శానిటేషన్ యూనియన్ ఆధ్వర్యాన కార్మికులు హాస్పిటల్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హాస్పిటల్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ, కరోనా మొదటి దశలో అమలుచేసిన రూ.16 వేలు జీతాన్ని కరోనా రెండో దశ 42 రోజులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎ వన్ కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారం కేవలం రూ 6,475 చెల్లించడం అన్యాయమన్నారు. తక్షణమే కరోనా రెండో దశకు మొదటి దశ మాదిరిగా జీతం అమలు చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ, శానిటేషన్ కార్మికులపై పనిభారం ఎక్కువగా ఉందని, అదనంగా కార్మికులను నియమించాలని కోరారు. ఇఎస్ఐ కడుతున్నా దానికి సంబంధించిన పత్రాలు నేటికీ ఇవ్వలేదన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే కార్మికులను వేధిస్తున్నారని తెలిపారు. తొలగించిన సెక్యూరిటీ గార్డు ఆర్.తిరుపతిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మిక చట్టాలను ఏ ఒక్క కాంట్రాక్టరూ అమలు చేయడం లేదన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా వేధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విమ్స్ డైరెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో విమ్స్ హాస్పిటల్ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.పార్వతి, వై.కనకరాజు, నగేష్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కైలాసగిరి అగ్ని ప్రమాదంపై ..

రోప్ వే నిర్వాహకులకు నోటీసులు


ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రణవ్‌గోపాల్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ పర్యాటక ప్రాంతమైన కైలాసగిరి రోప్‌వే వద్ద శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని వియంఆర్‌డిఎ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ శనివారం పరిశీలించారు. ఘటనకు గల కారణాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రోప్ వే వద్ద జరిగిన ఘటనపై విచారణ చేపట్టనున్నట్టు ప్రణవ్‌గోపాల్ తెలిపారు. రోప్ వే నిర్వాహకులకు నోటీసులు అందజేసామని, దీనిపై సమగ్ర విచారణ, దర్యాప్తు అయ్యేవరకు రోప్ వే సేవలను నిలిపి వేయనున్నట్టు చెప్పారు. కైలాసగిరిపై షాపు నిర్వహించే వారు అగ్ని ప్రమాద సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన కైలాసగిరిని ఆనుకొని ఉన్న హెల్త్ ఎరీనాను సందర్శించారు. వాకింగ్ ట్రాక్‌లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు చెప్పారు. వాకింగ్ ట్రాక్‌లో కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, వ్యాయామ పరికరాలు చాలా వరకు పాడైపోయాయని వాకర్స్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యాన మహిళా దినోత్సవం



తోకాడలో మాట్లాడుతున్న సీతాలక్ష్మి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యాన శనివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల సదస్సులు నిర్వహించారు.

గాజువాక : తోకాడ సమైఖ్య అపార్ట్‌మెంట్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కమిటీ మహిళా కన్వీనర్ ఎ.సీతాలక్ష్మి మాట్లాడుతూ, భవిష్యత్తులో జరిగే ప్రజా పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జె.రామన్న, సెక్రటరీ శ్రీనివాస్‌చౌదరి, ఉపాధ్యక్షులు ఎమ్.వెంకటేశ్వరరావు, మహిళా కమిటీ సభ్యులు స్వప్న, మణి పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యాన ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సదస్సు నిర్వహించారు.

విశాఖ డెయిరీ వద్ద సదస్సు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖ డెయిరీ వద్ద మహిళా కార్మికుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ పి.మణి మాట్లాడుతూ, 1907లో మహిళలు పోరాటం చేసి అంతర్జాతీయంగా ఉమెన్స్ డే సాధించుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.సంతోషం, ఎం.రాంబాబు, రమణ, భాస్కరరావు, మణిబాబు, అనసూయ, సత్యవతి పాల్గొన్నారు.



విశాఖ డెయిరీ వద్ద మాట్లాడుతున్న మణి

కరాస: జివిఎంసి 52వ వార్డు పరిధి హస్మి భవనంలో ఐద్వా ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ, మహిళా హక్కుల కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమైన రోజు అన్నారు. ఈ కార్యక్రమంలో సుమిత్ర, ఎం.జయలక్ష్మి, రమణమ్మ, కె.హేమలత, సుధ, జ్యోతి, ఉమా, లక్ష్మీమాధవి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : మహిళా దినోత్సవం సందర్భంగా ఎఎస్ఆర్.నగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. మహిళల విద్యకు, విభిన్న వృత్తులు చేపట్టటానికి ఉన్న ఆటంకాలను అధిగమించేందుకు ప్రభుత్వాలు, సమాజం, కుటుంబాలు కలిసికట్టుగా పనిచేయాలని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ప్రియాంక, ఆర్ఎన్.మాధవి, శోభ, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మధురవాడ : మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విద్యా పీఠ్‌లో వై.వెంకటేశ్వర్లు సహకారంతో సిఐటియు, ఐద్వా మధురవాడ జోన్ కమిటీల ఆధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని నార్త్ సబ్ డివిజన్ ఎసిపి ఎస్.అప్పలరాజు ప్రారంభించారు. డాక్టర్ ఎన్.నిఖిత కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి.రాజుకుమార్, డి.కొండమ్మ, బి.భారతి, కె.సుజాత, వై.రాజు, కె.దేవి, గంగాధర్, జి.మంగశ్రీ, జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎఎస్ఆర్.నగర్‌లో మాట్లాడుతున్న ప్రియాంక



హష్మీభవనంలో మాట్లాడుతున్న పద్మ

ములగాడ : సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. శ్రీహరిపురం నుంచి మల్కాపురం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మల్కాపురం సిఐటియు కార్యాలయంలో 'మహిళల హక్కులు- పరిష్కారం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా సంఘాల నాయకులు పూడి పైడిరాజు, పి.మణి, ఆర్.విమల, ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, కె.రమణ, బి.రాంబాబు, డి.రాము, డి.రాజు, బి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురంలో ర్యాలీ...



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -యంత్రాంగం

ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి దుర్గానగర్‌కు చెందిన ధరమిరెడ్డి సత్యవేణి అనారోగ్యానికి గురై సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయడంతో వచ్చిన రూ.3,42,780 చెక్కును ఆమెకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు శనివారం అందించారు. అదే ప్రాంతం తెలుగుదేశం కాలనీలో నివాసముంటున్న గంగడ కుమారికి రూ.87,295 చెక్కును కూడా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, పేదలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షులు మజ్జి మాలినాయుడు, నాయకులు నర్సింగరావు, డప్పు సన్యాసిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతమ్మధార : అనారోగ్యంతో బాధపడుతున్న అలవెల్లి వెంకట సునీల్ గుప్తాకు రూ.2.35 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును జనసేన నగర కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇది పేదల ప్రభుత్వం అన్నారు.



రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న బసవరాజు

మెగా రక్తదానం

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : దొండపర్తిలోని పద్మ పూజిత వీల్స్ మార్ట్ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన శనివారం మెగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. 296 మంది రక్తదానం చేసినట్లు సంస్థ చైర్మన్ బసవరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ప్రమాద బాధితులకు రక్తం ఎంతో అవసరమన్నారు. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను బసవరాజు అందించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థలో పనిచేస్తున్న మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణంరాజు, సాయిబాబా, వేణు, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, కిరణ్, నాయుడు, రహీం ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

మధురవాడ : టిడిపి సీనియర్ నాయకులు పిల్ల వెంకట్రావు, 7వ వార్డు కార్పొరేటర్ పిల్ల మంగమ్మ కుమారుడు కీర్తిశేషులు పిల్ల భరత్ కుమార్ (నాని) 31వ జయంతి సందర్భంగా పిలకవానిపాలెంలో శనివారం రక్తదాన, వైద్య శిబిరాలు, పలు క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బహుమతులు అందించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీచేశారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ ఎన్.అప్పారావు, మొల్లి లక్ష్మణరావు, వాండ్రశి అప్పలరాజు, నాగోతి సూర్యప్రకాష్, బివి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

28న ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ పనిచేస్తున్నాయని జాతీయ జర్నలిస్టుల సంఘం (ఎన్ఎజె) కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. అక్కయ్యపాలెం జంక్షన్‌లో ఉన్న ఒక ప్రయివేటు హోటల్‌లో శనివారం వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు, అక్రిడిటేషన్ల సదుపాయం కల్పించాలని, ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని కూటమి నాయకులకు దశల వారీగా వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సమస్యలను కూటమి ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని ఎదురు చూస్తున్నామన్నారు. విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ నెల 28వ తేదీన అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జర్నలిస్టుల ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విశాఖలో రాష్ట్ర మహా సభ

విశాఖ వేదికగా త్వరలో జరగనున్న రాష్ట్ర మహా సభను జయప్రదం చేయాలని గంట్ల శ్రీనుబాబు పిలుపునిచ్చారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను శ్రీనుబాబు, శ్రీనివాసరావు, దవళేశ్వరపు రవికుమార్ వివరించారు. గాజువాకలో రేపటి ఉదయం సంపాదకులు గొడబ రాంబాబు, మరోచిన్న పత్రిక సంపాదకుడులపై కొందరు దాడులకు ప్రయత్నించడాన్ని సమావేశంలో ఫెడరేషన్ ఖండించింది. మహిళా దినోత్సవం సందర్భంగా గాజువాకకు చెందిన సీనియర్ రిపోర్టర్ శిరీషను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపి బ్రాడ్ కాస్ట్ అసోసియేషన్ నగర అధ్యక్ష, కార్యదర్శి ఇరోతి ఈశ్వరరావు, కె.మధన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్ మోహన్, కె.శ్రీనివాసరావు, నాయకులు ఎ.సాంబశివరావు, దవళేశ్వరపు రవికుమార్, బి.సీతారామమూర్తి, బండారు శివప్రసాద్, కెవి.శర్మ, రవిశంకర్, బొబ్బర ప్రసాద్, శేషు, చక్రి, ఎంవి.రాజశేఖర్, పి.నగేష్‌బాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-మాధవధార : మాధవ యువజన సమాజం ఆవరణలో అనిల్ నీరుకొండ దంత వైద్యశాల ఆధ్వర్యాన శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు అనిల్ నీరుకొండ దంత వైద్యశాల సిబ్బంది వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ మాట్లాడుతూ, అనిల్ నీరుకొండ వైద్యశాల ఆధ్వర్యాన పేదలకు ఉచితంగా వైద్యసేవలందించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యమాలను గ్రామీణ ప్రాంతాల్లో కూడా చేయాలని కోరారు. శ్రీ మాధవ యువజన సమాజం అధ్యక్షులు సనపల రాంగోపాల్ మాట్లాడుతూ, మాధవదార గ్రామానికి చెందిన దంత వైద్యులు డాక్టర్ బగాతి యుక్తాముఖి ఆధ్యర్యాన ఉచిత సేవలందించడం అభినందనీయం అన్నారు. 50వ వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్ మాట్లాడుతూ, ఉచిత దంత వైద్య శిబిరాలను చుట్టు పక్కల ప్రాంతాలలో కూడా పెట్టి సేవలందించాలని కోరారు. ఈ కార్యమంలో అనిల్ నీరుకొండ దంత వైద్యశాల డాక్టర్లు ప్రహర్ష, యుక్తాముఖి, వినిల్లా, వసుందర, గ్రామ పెద్దలు పప్పల రామచంద్రరావు, బగాతి రాము, దుంపల రామారావు, సనపల నారాయణస్వామి, పొన్నాడ రాంబాబు, సనపల ధనంజయస్వామి, నంబాల వదంతరావు, సనపల సురేష్, సనపల నరసింహస్వామి, బగాతి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పరిశీలన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధిలో వున్న అన్న క్యాంటీన్‌ను పశ్చిమ నియోజకవర్గ జనసేన నాయకులు పుర్రె సురేష్ యాదవ్ శనివారం పరిశీలించారు. అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అందరితో కలిసి అక్కడ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కోలా రాము, సాలాపు రవి, అన్న క్యాంటీన్ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌లో అమ్మకు వందనం

ప్రజాశక్తి -గాజువాక : భాస్కర్ విద్యానికేతన్‌లో అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులను వారి తల్లులను ఉద్దేశించి పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ, నేటి మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించి గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా 5, 6 తరగతుల చిన్నారులు అమ్మపై పాడిన పాటలు, డ్యాన్సులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, రాణి, దివ్య, శైలజ, సునీత పాల్గొన్నారు.

నేటి నుంచి గ్లకోమా వారోత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గ్లకోమా (నీటికాసులు) వారోత్సవాలు ఈ నెల 9 నుండి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. వారం రోజుల్లో రోజూ ఉదయం 9 గంటల నుండి ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ప్రత్యేక గ్లకోమా స్క్రీనింగ్‌ను డాక్టర్ సౌజన్య, డాక్టర్ వాణిశ్రీ చేస్తారని, ప్రజలు వినియోగించు కోవాలని కోరారు. ముఖ్యంగా కళ్లద్దాలు వాడుతున్న, రక్తపోటు, సుగర్ వ్యాధిగ్రస్తులు తప్పక గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు ప్రారంభం



గ్రామాలకు పాదయాత్రగా వెళ్తున్న దృశ్యం

ప్రజాశక్తి- అచ్యుతాపురం

ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు శనివారం ప్రారంభమయ్యాయి. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము నాయకులు కర్రి అప్పారావు, సరగడము రాము నాయుడు, కె.సోము నాయుడు తదితరులు చైతన్య యాత్ర నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గ్రామంలో నేటి వరకు ఉపాధి హామీ పనులు చేపట్టకపోవడంతో కూలీలు ఉపాధి సమస్య ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే ఉపాధి పనులు ప్రారంభించి, కూలీలకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. రజకులకు ధోబీఖానాలు నిర్మించాలని, రజక కాలనీలో రోడ్డు నిర్మాణం చేయాలని, కౌలు రైతులకు రుణాలు, రైతు పథకాలు అందజేయాలని, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెండింగ్లో ఉన్న ఇల్లు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ప్రజలు తెలియజేసిన సమస్యలపై కార్యాచరణ రూపొందించి భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సిద్ధం చేస్తామని చెప్పారు. ప్రజా చైతన్య యాత్రలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.రామ్ నాయుడు, నూకరత్నం, అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట : సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం రావికమతం మండలం చీమలపాడు పంచాయతీలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు నేరేళ్లబంద గ్రామం నుంచి బంగారు బందల గ్రామం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు మాట్లాడుతూ, ఈ పంచాయితీ పరిధిలో కొండ శిఖర గ్రామాలైన నేరేళ్ల బంద, జీలుగులోవ, సోంపురం గ్రామాలలో కొందుజాతికి చెందిన 30 కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. స్థానికంగా గ్రామాలలో ఉపాధి హామీ పనులు కల్పించ లేదన్నారు. తక్షణమే పనులు కల్పించాలని డిమాండ్ చేసారు. నర్సీపట్నం నుంచి కల్యాణపులోవ, జెడ్.జోగుంపేట వరకు బస్సు సౌకర్యం కల్పించాలని, ఆర్టిసి అధికారులు స్పందిం చకపోతే ఈ నెల 25న డిపో ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, సేదరి కామేశ్వరరావు, కొర్రా మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న శాంతి

ఉత్తమ మహిళా ఉద్యోగిగా పిఎసిఎస్ సిఇఒ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట, మండలం వడ్డాది పిఎసిఎస్ సీఈవో ఎం.శాంతికి ఉత్తమ మహిళా ఉద్యోగిగా అవార్డు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఆప్కాబ్ కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. విశాఖ ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ తరపున ఉత్తమ మహిళా ఉద్యోగిగా ఆమెకు ఈ అవార్డు లభించింది. మహిళా ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని పలువురు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవార్డు తనకు రావడం ఎంతో సంతోషంగా ఉందని, తనకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని చెప్పారు.

జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-పరవాడ : జనరిక్ మందుల వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీ సిఎం రమేష్ అన్నారు. ఈ లక్ష్యంతోనే ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశంలో ఏటా మార్చి 7న జన్ ఔషధీ దివస్‌ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరవాడ దీపాంజలి నగర్ దగ్గర ఉన్న ఎన్టిపిసి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రం జనరిక్ మెడికల్ షాప్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది ప్రజల ఆరోగ్య ఖర్చులను తగ్గించడంలో ఔషధీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. 2000 కంటే ఎక్కువ రకాల మందులు, 300 శస్త్ర చికిత్స ఉత్పత్తులను తక్కువ ధరలకు ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మరికొన్ని కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఉన్నతమైన బ్రాండ్ గల మందులను దాదాపు 50 శాతం నుండి 90 శాతం రాయితీతో ఈ కేంద్రాల ద్వారా అందజేస్తున్నట్లు, శానిటరీ నాప్కిన్ కేవలం ఒక్క రూపాయికే అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్టిపిసి సిజిఎం సమీర్ శర్మ, కూటమి నాయకులు కేతినేని సురేంద్రమోహన్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బండారు అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విశాఖపట్నం -పేద మదీనా బస్సు రాకపోకలకు ఇబ్బంది లేకుండా కెపి.అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు రోడ్డు మరమ్మతులు, తుప్పలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. రోడ్డుపై గుంతలు, ఇరువైపులా తుప్పలు, చెట్లు వల్ల కొంతకాలం బస్సు రాకపోకలను నిలిపివేశారు. దీంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కెపి.అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు రెండు రోజులుగా రోడ్డుపై గుంతలను జేసీబీతో కప్పించారు. రోడ్డు పక్కన పెరిగిన తుప్పలు, చెట్లను తొలగించే పనులు చేపట్టారు. విశాఖపట్నం - పేద మదీనా బస్సు మండలంలోని కేపీ అగ్రహారం, కొండపాలెం, గున్నెంపూడి, పెద్దమదిన గ్రామాలకు పెద్ద దిక్కుగా వుంది. ఉదయం పెద్దమదీన నుండి విశాఖపట్నం వెళ్లి మధ్యాహ్నం వస్తుంది. ఈ బస్సుపై ఆధారంగా విద్యార్థులు చోడవరం, వడ్డాది తదితర ప్రాంతాల్లో కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లి వస్తుంటారు. పలువురు ఉపాధి కోసం చోడవరం వెళ్లి వస్తుంటారు. రోడ్డుపై గుంతలు బాగా పెరిగిపోవడం, చెట్లు పెరిగి బస్సు అద్దాలకు తగులుతుండడంతో అద్దాలు పగిలిపోతుండడంతో బస్సులను నిలిపివేశారు. దీంతో విద్యార్థులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు సొంత నిధులతో పనులు చేయించారు. దీంతో సమస్యకు పరిష్కారం లభించిందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు బహుముఖ పోటీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సందర్భంగా ఎంపీడీవో సువర్ణ రాజు మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. పాటల పోటీలు, కామెడీ, మిమిక్రీ వంటి పోటీలు నిర్వహించి మహిళలను ఉత్తేజపరిచారు. అనంతరం ఎంపిక చేసిన ప్రభుత్వ ఉద్యోగ మహిళలను వెలుగు సిబ్బంది అంగనవాడి వైద్య రంగాల్లో బాగా ప్రజలకు సేవలు అందించిన వారిని ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి జడ్పిటిసి కర్రి సత్యం, తాసిల్దార్ లక్ష్మీదేవి, వివిధ శాఖల అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

11న జిల్లాస్థాయి గుర్రపు పందేలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో శ్రీపరదేశమాంబ అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా ఈనెల 11న మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుండి అమ్మవారి గుడి ఆవరణలో జిల్లా స్థాయి గుర్రం పందెం పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ ఈ మేరకు గుర్రపు పందాలు పోటీలకు స్థలం, ఏర్పాట్లను ఎంపిటీసీ బోకం బాలకృష్ణ (బాలు), వైసిపి మండల యువజన విభాగ అధ్యక్షుడు బోకం శ్రావణ్ కుమార్, బోకం శ్రీనివాసరావు (కాసుబాబు), బోకం శేషగిరిరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలకు నగదు బహుమతులు ఇవ్వబడతాయని పేర్కొన్నారు. ఈ పోటీలో పాల్గొన్న వారికి రవాణా ఖర్చులు నిమిత్తం రూ.1000 ఇస్తామన్నారు.

కోలాటం, వాలీబాల్ పోటీలు

తవ్వవానిపాలెం పరదేశమ్మ అమ్మవారి పండగ మహోత్సవాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ బోకం స్వామినాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 10న తొలివేల్పు, 11న అనుపు మహోత్సవం జరుగుతుందని, దీనికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 10న మధ్యాహ్నం 3 గంటల నుండి రాష్ట్ర స్థాయి చిరతలు (డీజే కోలాటమలు) పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు ప్రథమ బహుమతి రూ.12 వేల, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.8 వేలు, నాలుగో బహుమతి రూ.6వేలు, 5వ బహుమతి రూ.4వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. 11నఉదయం 10 గంటల నుండి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రథమ బహుమతి రూ.12 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.8 వేలు, నాలుగో బహుమతి రూ.6 వేలు అందిస్తామన్నారు. 11న రాత్రి 8 గంటల నుండి ఎమ్మెల్యే ఈవెంట్స్, లహరి సౌండ్ వారి ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, పలు సాంస్కృత కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చింతపాలెంలో సీతారాముల తీర్థం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆర్లి శివారు చింతపాలెం గ్రామంలో శనివారం సీతారాముల తీర్థ మహోత్సవం ఆ గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి శ్రీరాముల ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

రంగస్థల నటుడు కృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన సీనియర్ రంగస్థల నటుడు మళ్ల కృష్ణకు స్థానిక కళాకారులు అనేక మంది ఘన నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన కృష్ణ దశదిన కార్యక్రమంలో భాగంగా వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ హాజరై కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థం మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, శ్రీరాములు, ఆడారి గంగ మహేష్, గోపి, అప్పారావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత రాష్ట్రంగా ఏపి

స్పీకర్ అయ్యన్న, మంత్రి రవీంద్ర



నవోదయం వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపి అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నవోదయం ప్రచార రథాన్ని శనివారం వారు ప్రారంభించారు. నవోదయం పోస్టర్లు, పాంప్లెట్స్, స్టికర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాను నాటుసారా రహితంగా తీర్చి దిద్దేందుకు గ్రామ గ్రామాన ప్రజల్లో నాటు సారాకు వ్యతిరేకంగా చైతన్యం కలిగించేందుకు ప్రచార రథాన్ని ప్రారంభించనట్లు తెలిపారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సూర్జిత్ సింగ్ మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకు 202 నాటుసారా కేసులు నమోదు చేసి, 107 మంది ముద్దాయిలను అరెస్టు చేశామన్నారు. 1022 లీటర్ల నాటు సారా స్వాధీన పరచుకున్నామని, నాటు సారా తయారీలో ఉపయోగించే 69,260 లీటర్ల పులిసిన బెల్లము ఊటను ధ్వంసం చేసి, 15,289 కేజీల బెల్లమును స్వాధీన చేసుకున్నామని తెలిపారు. 10 వాహనాలును జప్తు చేశామని, 550 మంది పాత నేరస్తులపై నిఘా ఉంచి వారిపై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ సిఎం రమేష్, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, కలెక్టరు విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా , జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ టి.రాజశేఖర్, ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మున్నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

యుబిఐ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న రాంబాబు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను యథావిధిగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయరాదని ఎబిఐఇఎ రాష్ట్ర కార్యదర్శి బిఎస్ రాంబాబు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకును ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధపడితే, దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు ఉద్యోగస్తులంతా కదన రంగంలోకి దూకి ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎపియుబిఇఎ ప్రథమ ఉమెన్స్ కన్వెన్షన్ - 2025 శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. వందలాది మంది మహిళా ప్రతినిధులు పాల్గొన్న ఈ సభను ఆయన ప్రారంభిస్తూ ఒకప్పుడు ప్రైవేటు రంగంలో ఉన్న బ్యాంకుల వల్ల దేశ ప్రజలు, ప్రభుత్వాలు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పట్లో బ్యాంకులను జాతీయీకరణ చేయాలనే ఉద్యమాలు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. మహిళా ఉద్యోగులు కూడా ఆ ఉద్యమాల్లో అధిక సంఖ్యలో భాగస్వాములు అయ్యారన్నారు. ఈ నేపథ్యంలో 1969లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ బ్యాంకుల జాతీకరణకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. దీంతో లక్షల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు బ్యాంకుల్లో లభించాయన్నారు. అదే సందర్భంలో దేశ ఆర్థిక వ్యవస్థకు బ్యాంకులు ఎంతగానో దోహదపడ్డాయని, ఈనాటికీ ఆ ఒరవడి కొనసాగుతుందని తెలిపారు. బ్యాంకుల ప్రైవేటీకరణ జరిగితే ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందన్నారు. లక్షలాది మందికి ఉపాధి కనుమరుగు అవుతుందన్నారు. ఎపిఎబిఇఎ ప్రధాన కార్యదర్శి వి.ఉదయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఫ్‌జిఎం జనరల్ మేనేజర్ శాలిని మీనన్, ఎబిఐఇఎ ఉపాధ్యక్షులు ఎస్.శంకర్, నేషనల్ ఉమెన్స్ కౌన్సిల్ ఎబిఐఇఎ చైర్పర్సన్ లలితా జోషి తదితరులు పాల్గొన్నారు.

10న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి గోవాడ రాక

సుగర్ ఫ్యాక్టరీని సందర్శించి రైతులతో ముఖాముఖి కానున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చోడవరం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ నెల 10న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని సందర్శిస్తారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాక్టరీ పరిశీలన అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడుతారని పేర్కొన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారం లేకపోవడంతో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టులాడుతోందని, ఫ్యాక్టరీ నిర్వహణకు కూడా డబ్బులు లేవని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఫ్యాక్టరీ నడవలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. గతేడాది చెరుకు సరఫరా చేసిన రైతులకు టన్నుకు ఇంకా రూ.150 చొప్పున ఇవ్వాల్సి ఉందని, కార్మికులకు 4 నెలలు నుండి జీతాలు, రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించలేదని తెలిపారు. ఫ్యాక్టరీలో సాంకేతిక సమస్యలు ఎక్కువై తరచూ మరమ్మతులకు గురవుతోందని, దీంతో రైతులు చెరుకు తీసుకొస్తున్నా సకాలంలో క్రషింగ్ చేయలేని పరిస్థితి నెలకొందని వెల్లడించారు. ఈ ఏడాది కనీసం లక్షా 50వేల టన్నులైనా చెరుకు క్రషింగ్ చేయవలసి ఉండగా, ఇప్పటివరకు 65,553 టన్నులు మాత్రమే చేసిందని పేర్కొన్నారు. రైతులు, కార్మికులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే 25 వేల కుటుంబాలను ఆదుకున్నట్లు అవుతుందని తెలిపారు. గోవాడ ఫ్యాక్టరీ మనుగడ సాగకపోతే చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో ప్రజల జీవనం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీని సందర్శించనున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, ఇతర నేతలు ఫ్యాక్టరీ రక్షణకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు రైతులందరూ ఈ నెల 10న సోమవారం ఉదయం 10 గంటలకు ఫ్యాక్టరీ వద్దకు వచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వెంకన్న కోరారు.

రేపటి నుండి పబ్లిక్ గ్రీవెన్స్ పునరుద్ధరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రజలకు మరింత సమర్థవంతంగా అమలు చేసే నిమిత్తం జిల్లాలోని కలెక్టరు కార్యాలయంతో పాటు, డివిజను, మండల, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామసచివాలయాలలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించుటకు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

పి4 సర్వేలు ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చంద్రయ్యపేటలో పి4 సర్వేను స్థానిక ఎంపిడివో సాంబశివరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి దోహదం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పి4 సర్వే చేపట్టిందని తెలిపారు. పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న పేదలను గుర్తించడం ఈ సర్వే ఉద్దేశమన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, అనర్హుల తొలగింపు వంటి అంశాలకు ఈ సర్వేకు ఎటువంటి సంబంధం లేదని ఎంపిడివో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం : పి4 సర్వేకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి సూచించారు. ఈ సందర్భంగా మండలంలో కవగుంట గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో శనివారం సర్వే ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, వెటర్నరీ అసిస్టెంట్ దేముడు పాల్గొన్నారు.

నక్కపల్లి : ప్రభుత్వ,ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే మండలంలోని శనివారం ప్రారంభించారు. ఉపమాకలో సచివాలయ ఉద్యోగులు ఇంటింటా సర్వే చేపట్టారు. ఎంపిడివో డి సీతారామరాజు సర్వేను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు

టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల ఫేర్వెల్ ఫంక్షన్ అంగరంగ వైభవంగా జరిగింది. తుమ్మపాల ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, ఆడారి గోవిందరావు, స్కూల్ కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం, స్కూల్ కమిటీ డైరెక్టర్ కాను ప్రదీప్ రెడ్డి విద్యార్థులకు సూచనలను సలహాలు అందించారు. అనంతరం పిల్లలు కమిటీ వారికి పాఠశాల టీచర్లకి, సిబ్బందికి సత్కారం చేశారు. పాఠశాల హెచ్ఎం శంకర్రావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

టిడ్కో ఇళ్లకు వీధిలైట్లు వేయాలని వినతి

ప్రజాశక్తి-పరవాడ : టిడ్కో గృహ సముదాయాల వద్ద వీధిలైట్లు వేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆధ్వర్యంలో శనివారం పరవాడ ఏపీఈపీడీసీఎల్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. కాలనీలో 1839 ఇండ్లు ఉన్నాయని, వీధిలలో రోడ్డులలో వీధి లైట్లు లేక చీకట్లో భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. రాత్రులు పాములు ఇండ్లలోకి వస్తున్నాయని, రాత్రి సమయంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి అన్నపూర్ణ, వి మంగ, ఎస్ కనకమహాలక్ష్మి, ఆర్ ఇందుమతి, ఎం సంతోషి కుమారి, టి సూరమ్మ, డి లక్ష్మి కే లక్ష్మి, ఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఉత్సవాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గిరిజాంబగిరిపై ఈ నెల 10 నుండి 15 వరకు నిర్వహించనున్న వెంకటేశ్వర స్వామి 152వ వార్షిక కళ్యాణ మహోత్సవాలను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం వడ్డాదిలో వర్తక సంఘం ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. 10 నుండి 14 వరకు ఐదు రోజులపాటు స్థానిక జంక్షన్లో సాంస్కృతిక ప్రదర్శనలు, భారీ విద్యుత్ సెట్టింగ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. అనవసర వివాదాల జోలికి పోకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. తెలుగు రాష్ట్రాల నుండి నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా యువత సహకరించాలని, అనవసరంగా ఎవరైనా వివాదాలు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొండా నారాయణ మూర్తి, నరేష్, గిరిబాబు, దాడి సూర్య నాగేశ్వరరావు, గరికపాటి మేఘరావు, సయ్యపురెడ్డి శ్రీనివాస్, బేతి వెంకటరమణ, దాడి గోవింద పాల్గొన్నారు.

సమావేశాలంటే రెవెన్యూ అధికారులకు లెక్కలేదా?

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి గోవింద్ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపిపి గోవిందరావు

ప్రజాశక్తి - యలమంచిలి

సమావేశాలంటే రెవెన్యూ అధికారులకు లెక్కలేదా? అంటూ ఎంపిపి బోదెపు గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రెవెన్యూ అధికారులు రాని విషయం తెలుసుకొని వారిపై ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే హాజరైతేనే హాజరౌతారా? వరుసగా సమావేశాలకు రెవెన్యూ అధికార్లు హాజరుకాకపోవడం పట్ల ఎంపిడిఒపై ఆయన సీరియస్ అయ్యారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన నిర్ణయాలు తీసుకొనే మండల పరిషత్ సమావేశాలకు వరుసగా ధుమ్మా కొట్టడం వెనుక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. మేం అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట.. మీరు అధికారంలో ఉన్నప్పుడు మరోమాట... ఇదేనా ప్రజాస్వామ్యానికి మీరిచ్చే నిర్వచనం? అంటూ కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఎక్సైజ్ అధికార్లనుద్దేశించి మాట్లాడుతూ గంజాయిని పూర్తిగా అరికట్టామని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వంలో వేల కేజీల గంజాయి కేసులు ఎందుకు నమోదవుతున్నాయని ప్రశ్నించారు. నిత్యం స్కూళ్లు , కాలేజీ విద్యార్థులు వందల సంఖ్యలో గంజాయి సేవిస్తున్న సంగతి ఎక్సైజ్ అధికార్లకు తెలీదా అని నిలదీశారు. మండలంలో 'ఈగల్' పేరుతో ఏంటీ నార్కొటిక్ గ్రూప్లు ఏర్పాటు చేశారా? చేస్తే అందులో ఎవరున్నారో వారి ఫోన్ నెంబర్లు ఇవ్వాల్సిందిగా అడిగారు. దానిక ఎక్సైజ్ అధికారి సరైన జవాబు చెప్పలేకపోయారు. సమావేశంలో తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆరోగ్యం, రోడ్లు, పలు అంశాలు చర్చకు వచ్చాయి. పంచాయితీ రాజ్ బిల్లుల పట్ల కూడా చర్చ జరిగింది. సమావేశంలో వైస్ ఎంపిపి శేషు, జడ్పిటిసి సంధ్యారాణి, ఎంపిడిఓ కొండలరావు, సూపరింటెండెంట్ ప్రసాదరావు, సర్పంచ్లు, ఎంపిటీసీలు, అధికార్లు పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా ప్రతినిధులను సత్కరించారు.

లక్ష్మీనీరజకు ఉత్తమ ఎఫ్పిఒ సిఇఒ అవార్డు


లక్ష్మీనీరజకు అవార్డు అందిస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-అనకాపల్లి : అమృత ఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సీఈఓ కందర్ప లక్ష్మీ నీరజ మౌక్తికకు ఉత్తమ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ అవార్డు దక్కింది. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆధ్వర్యంలో అనకాపల్లి పెంటకోట ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును ఏపి అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ మంత్రి కొల్లి రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్బాబు, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ జి.ప్రభాకర్, అగ్రికల్చర్ ఆఫీసర్ మోహనరావు, జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుజాత, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, పెద్ద పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎన్టిఆర్ నగర్లో రోడ్డు నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 80 డివిజన్ ఎన్టీఆర్ నగర్లో రోడ్డు శనివారం రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ఈ కాలనీలో రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణం రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొడ్డేడ జోగినాయుడు, బుద్ధ శ్రీనివాసరావు, కాండ్రేగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి మందిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ శివారు కూండ్రపువానిపాలెంలో శ్రీరామ, సత్యసాయి మందిరం 18వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. జోగన్నపాలెం, రామచంద్రపురం, కూండ్రపువానిపాలెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు నామ సంకీర్తన, భజనలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కన్నూరు అప్పలనాయుడు, రాఘవరావు, జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, కన్నూరు సూర్యనారాయణ, బండారు నారాయణపాత్రుడు, జూరెడ్డి రాము పాల్గొన్నారు.

బైక్ రేసర్లపై ట్రాఫిక్ పోలీసుల దాడులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్, ఎంవిపి, ద్వారకా పోలీస్ స్టేషన్ల పరిధిలో బీచ్ రోడ్డు ప్రాంతంలో ద్విచక్ర వాహనాలపై ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తున్న 16 మంది బైక్ రేసర్లను అరెస్ట్ చేసినట్లు ట్రాఫిక్ విభాగం అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీచ్ రోడ్లో పలువురు యువకులు చిత్రవిచిత్రమైన విన్యాసాలు చేస్తూ ప్రమాదకరమైన స్టంట్స్ నిర్వహిస్తున్నారని, పాదచారులు, ఇతర వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారని తమకు సమాచారం అందినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో దాడులు నిర్వహించి వారికి చెందిన 16 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు.

పుట్టినరోజు వేడుకలు జరపొద్దు


రేబాక మధు

ప్రజాశక్తి-అనకాపల్లి : యువతలో రక్తదాన, రాజ్యాంగం, విద్యపై చైతన్యం తీసుకొస్తూ సేవా కార్యక్రమాలతో నిరంతరం ముందుకు సాగే అనకాపల్లి జిల్లా డివిఎంసి సభ్యులు రేబాక మధుబాబు ఈనెల 10వ తేదీ జరగబోయే పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెలలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా ఎవరు కటౌట్లు పెట్టి డబ్బులు వృధా చేయవద్దని, వీలైనంతవరకూ దగ్గరలో ఉన్న హాస్టల్ విద్యార్థులకు ఆ డబ్బుతో కావలసిన కార్యక్రమాలు చేయాలని సూచించారు.

నేడు మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేటలో మోదకొండమ్మ అమ్మవారి 20వ వార్షిక పండుగ ఆదివారం జరగనుంది. ఈ సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.12వేలు, రూ.8వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3వేలు నగదు పురస్కారం అందిస్తామని చెప్పారు.

చర్చలు ద్వారా సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : పరస్పర చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకొని శాంతియుత వాతావరణంలో మెలగాలని 9వ అదనపు జిల్లా జడ్జి కే రత్నకుమార్ సూచించారు. శనివారం చోడవరం కోర్టుల సముదాయంలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా ఇరు వర్గాల వారు తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సూచిస్తూ కాలాన్ని, ధనాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకర్, ఫస్ట్ ఏడిఎం ఏ రమేష్, చోడవరం సిఐ పి అప్పలరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే డేవిడ్, సెక్రటరీ గొర్లి కృష్ణవేణి తదితరులు పాల్గొని మాట్లాడారు.


మాట్లాడుతున్న జిల్లా జడ్జి రత్నకుమార్

ఘనంగా మహిళా దినోత్సవం



తగరపువలస డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ పద్మ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలోనూ, హెరిటేజ్ డెయిరీ ఆవరణలోనూ భవానీ విద్యానికేతన్ స్కూల్లోనూ మహిళలను ఘనంగా సన్మానించారు. ఎస్ఐ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో ర్యాలీ చేశారు. భవాని విద్యానికేతన్ స్కూల్లో మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మహిళా ఉపాధ్యాయులను సన్మానం చేశారు.

చోడవరం : ఆర్యవైశ్య మహిళా విభాగం ఎస్‌వి మాధవ ఆధ్వర్యంలో చోడవరంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడారు. ఎంపిడిఒ కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. శ్రీవిముక్తి సంఘటన పట్టణంలో ర్యాలీ నిర్వహించగా, చోడవరం కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు రత్న కుమార్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.

సబ్బవరం : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో పి.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆరిపాక గ్రామానికి చెందిన ఎస్‌హెచ్‌జి గ్రూప్ మహిళ సుదల ఉమాదేవిని సన్మానించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు హరిణి, సునీత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ వారి ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి మాట్లాడారు.

కశింకోట : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, ఎంపీడీవో వివి.రవికుమార్, పంచాయతీ విస్తరణాధికారి వెంకట లక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు. కశింకోట బాలికల హైస్కూల్ విద్యార్థులు సీఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వివిధ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు మనోజ్ కుమార్, లక్ష్మణ రావు పాల్గొన్నారు.

పరవాడ : మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో ధర్మారావు ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపీపీని, ఉత్తమ డ్వాక్రా ఓం గణపతి గ్రూప్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పిఎస్.రాజు, రావాడ సర్పంచ్ మోటారు సన్యాసి నాయుడు, ఏఓ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు. పరవాడ మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులందరూ లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సమావేశమై మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎం.దివాకరరావు, జి.సాయి శైలజ, ఉపాధ్యాయులు కే రవి, డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక గొన్న కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవంలో గొలి శ్యామల, గొన్న హెమ్ చంద్ నాయుడు పాల్గొన్నారు. పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ హారిక మాట్లాడారు.

యలమంచిలి : పరవాడ డిఎస్‌పి స్వరూప్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో పద్మావతి, మెప్మా కార్యకర్తలు, అంగన్వాడీలు పాల్గొన్నారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ మహిళా కార్మికులకు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్థానిక మండల కేంద్రంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తాసిల్దార్ లక్ష్మి, ఏపీఎం తిరుమలరావు ఎంపీపీ నాగేశ్వరి దేవి సర్పంచ్ సుంకర లక్ష్మి పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక భీమునిగుమ్మం జీవీఎంసీ హైస్కూలో జరిగిన మహిళా దినోత్సవంలో డీఈవో అప్పారావు నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పొన్నాడ అప్పారావు, పరీక్షలు విభాగం సహాయ కమిషనర్ ఎ.శ్రీధర్ రెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

కొత్తకోట:మహిళలు అన్ని రంగాలలో సాధికారత సాధించి దేశ సమగ్రాభివృద్ధికి నిర్ణయా త్మకమైన పాత్ర పోషించాలని కొత్తకోట సీఐ కోటేశ్వర రావు అన్నారు. కొత్తకోట సర్కిల్ పరిధిలో రావికమతం, రోలుగుంట, కొత్తకోట, బుచ్చయ్య పేట పోలీస్ స్టేషన్ లలో విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాస్, రఘువర్మ, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

రావికమతం:మహిళలు అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందాలని చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండల కేంద్రం వెలుగు మండల మహిళా సమైక్య కార్యాలయంలో మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలను ఎమ్మెల్యే సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, ఏపిఎం ఈశ్వరరావు, రావికమతం సర్పంచ్ మోది నాయుడు పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ఆవరణలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు,

మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి హాజరయ్యారు,

నక్కపల్లి :ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో డి సీతారామరాజు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్‌లను ఘనంగా సత్కరించారు.

గొలుగొండ:గొలుగొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పీ.రామారావు మహిళా పోలీస్ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.మహిళలందరూ అన్ని రంగాల్లో రాణించాలని గొలుగొండ మండలం ఏఎల్.పురం సెక్టార్ సూపర్‌వైజర్ సత్యశ్రీ అన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలో డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థినీలతో భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై కృష్ణాబజారు, అబీద్ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ట్రెయినీ డీఎస్పీ చైతన్య, టౌన్ సీఐ జీ.గోవిందరావు, ఎస్సైలు జీ.ఉమామహేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు. నర్సీపట్నం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడారు. ఉత్తమ ఆర్పీలకు అవార్డులను అందజేశారు. కౌన్సిలర్లు విజయాంబ, గుడబండి ఆదిలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీ.రామలక్ష్మీ, సత్యవతి పాల్గొన్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద పద్మావతి కేక్ కట్ చేశారు. నాతవరం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు సత్యవతి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

నెహ్రూ కేంద్ర విశాఖపట్నం, లిఫ్ట్ రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ, శ్రీ వేమ ఎన్జీవో వేములపూడి సంయుక్త ఆధ్వర్యంలో ఎనోబిల్ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ జీ.మహేశ్వరరావు, ప్రముఖ సైకాలజిస్ట్ సుమ,భారతీయ జనతా పార్టీ నర్సీపట్నం మండల అధ్యక్షులు, శ్రీవేమ ఎన్జీవో కార్యదర్శి బోళెం శివ మాట్లాడారు. లిఫ్ట్ రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి సిహెచ్‌విఎస్ఆర్.ప్రసాద్, కెఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కాళ్ళ సుబ్బారావు, మిరాకిల్ ఎన్జీవో సన్యాసినాయుడు, రాజు, కళాశాల ఇన్‌చార్జ్ వి.కనకేశ్వరి పాల్గొన్నారు.



నర్సీపట్నంలో కేక్ కట్ చేస్తున్న పద్మావతి

చీడికాడ :మండలంలోని బైలపూడి గ్రామ పంచాయతీలో పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ గాజుమొగ్గలు గంగ తల్లి, ఎంపీటీసీ సభ్యురాలు దాడి నాగరత్నం, ఎంపీపీ కురచా జయమ్మ , మండల పరిషత్ ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాడుగుల:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో మహిళా సర్పంచులకు, ఎంపీటీసీలకు, అధికారులను సన్మానించారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి పాల్గొన్నారు.

రోలుగుంట:కూటమి ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తుందని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. రోలుగుంట స్త్రీశక్తి భవనంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ లక్ష్మీ, ఎంపిటిసి సుర్ల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు గుములూరు చంద్రమౌళి, ఎంపిడిఒ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కీర్తి పట్నాయక్‌కు బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు

మాధవధార : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార చారిటబుల్ ట్రస్ట్ అధినేత కుప్పిలి కీర్తి పట్నాయక్‌కు బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డును జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ అందజేసి శాలువాతో సత్కరించారు. ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు సేవ చేయడంతో ఈ అవార్డును అందుకున్నారు.

ములగాడ : ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యాన గాజువాక ఆర్‌టిసి డిపోలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు ముఖ్యఅతిథిగా హాజరై మహిళలను సత్కరించారు.

జివిఎంసి 61వ వార్డులో మజ్జి సోమేష్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. డ్వాక్రా మహిళలను ఎమ్మెల్యే గణబాబు సత్కరించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి, సర్వసిద్ధి శ్రీను, కాకి పోలిరెడ్డి పాల్గొన్నారు.

సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ, పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో మహిళలు 80 శాతం మంది ఉన్నారని తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలందించిన పలువురు మహిళలకు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.శాంతిప్రభ, శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ బి.సుజాత, మలేరియా అధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డు పరిధి దొండపర్తి కుమ్మరవీధిలో జనసేన ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సత్కరించారు. కార్యక్రమంలో గుండు సురేష్‌బాబు పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్, ప్రిన్సిపల్ ఎన్ఇ.ఫ్లోరా, వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేపగుంట : నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన సీనియర్ డాక్టర్లను, మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర, డాక్టర్ కృష్ణ, కె.బంగారు రాజు పాల్గొన్నారు.

పద్మనాభం : ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ కుటుంబ భలోపేత కార్యక్రమం వారు కురపల్లి గ్రామంలో మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ ఎం.విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం పి.శ్రావణి, కరోతు దుర్గరాజు, చందక జానకి పాల్గొన్నారు

పద్మనాభంలోని గోస్తనీ ప్రయివేటు స్కూల్లో మహిళా ఉపాధ్యాయులను, గ్రామపంచాయతీ పరిధిలో పనిచేసిన క్లీన్ అండ్ గ్రీన్ వర్కర్లను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు కాల్ల సూరిబాబు, డైరెక్టర్ మనోహర్, ప్రిన్సిపల్ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



కేర్‌లో కోలుకున్న మహిళా రోగులతో ఆసుపత్రి సిబ్బంది

తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ సభ ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా పాత్రా ఇండియా బిపిఒ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.లక్ష్మి హాజరై మహిళా దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో జెఎన్‌టియు విజయనగరం జివి కళాశాల హెచ్‌ఒడి విఎస్.వకుళ, అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.అభిప్రియ, మాధురి, కళాశాల ప్రిన్సిపల్ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

తగరపువలసలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి అధ్యక్షతన సభ నిర్వహించారు. రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె పద్మ పాల్గొన్నారు. మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమిలి మండలం చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేశారు. భీమిలి పిహెచ్‌సి వైద్యులు కల్యాణి, ఊహ మహంతి, దివీస్ సిఎస్ఆర్ మేనేజర్
డి సురేష్‌కుమార్ పాల్గొన్నారు

ఆనందపురం : విశాఖపట్నం జిల్లాలో ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామపంచాయతీగా ఆనందపురం మండలం గంభీరం గ్రామ పంచాయతీ ఎంపిక కావడంతో ఉత్తమ సేవలందించిన సచివాలయ, శానిటేషన్ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఎంపిడిఒ డాక్టర్ జానకి, ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం గాయత్రీ డిగ్రీ కాలేజీలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. ప్రిన్సిపల్ దుక్క అప్పలరాజు, అధ్యాపకులు సునీత, టి పద్మ పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని కేర్ ఆసుపత్రిలో కోలుకున్న మహిళా రోగులను, వారికి సహకరించిన సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆర్థోపెడిక్ డాక్టర్ రవిచంద్ర వట్టిపల్లి, సిఇఒ మయూర్ చౌదరి, డాక్టర్ అనీల్ పాల్గొన్నారు.

వేపగుంట : వేపగుంట బీసీ కాలనీలో మహిళలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సన్మానించారు. మహిళా సంఘ నాయకులు రమణి మహిళల సమస్యలపై పోరాటం చేయడాన్ని అభినందించారు.

విశాఖపట్నం: జెసిఐ వైజాగ్ ఎచీవర్స్ ఆధ్వర్యాన ప్రభుత్వ మానసిక ఆసుపత్రి ప్రాంగణంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెవి.రామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయలక్ష్మి, హోమియో వైద్యులు డాక్టర్ శీతల్‌మదన్ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ హెచ్‌ఒడి, ఎఐ అండ్ డిఎస్ డాక్టర్ రాధ హాజరయ్యారు. సమాజంలో మహిళల పాత్రను వివరించారు. డాక్టర్ కె.యమున, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఎల్‌లో..

హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో సిఎమ్‌డి హేమంత్ ఖత్రి మాట్లాడారు. మహిళలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. ముఖ్య అతిథిగా సంరక్షణ్ (హెచ్ఎస్ఎల్ లేడీస్ క్లబ్) అధ్యక్షురాలు వందనా ఖత్రి హాజరయ్యారు.

విశాఖ కలెక్టరేట్ :మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం కార్యాలయంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు.

జీడి పిక్కలకు గిట్టుబాటు ధర ప్రకటించాలి

-ఆర్‌బికెల్లో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
-సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి- నాతవరం:జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఉటమళ్ళ, తాళ్ళపాలెం గ్రామాల్లో జీడిమామిడి తోటలను సిపిఎం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించ లేదని తెలిపారు. జీడిపిక్కల పంట సమయంలో వ్యాపారులు ధరను తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వ్యాపారుల చేతికి జీడిపిక్కలు చేరిన తరువాత అమాంతంగా జీడి ధర పెరుగుపోతుందన్నారు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రస్తుతం 80 కేజీల జీడి పిక్కల బస్తాకు వ్యాపారులు రూ. 8,000 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. జీడిపప్పు బస్తా (80కేజీలు) పిక్కలకు 22 కేజీలు పప్పు వస్తుందన్నారు. మరో 3 కేజీలు ముక్కలు, తొక్కలు ఒక బస్తాకు 50 కేజీలు వస్తాయన్నారు. దీని ప్రకారం ప్రస్తుత మార్కెట్లో ధరల ప్రకారం సుమారు బస్తాకు రూ. 19,400 ఆదాయం వ్యాపారులకు వస్తుందన్నారు. ప్రోసెసింగ్ ఖర్చు బస్తాకు రూ.2,000, రైతుకు చెల్లించే రూ.16,000 కలిపి మొత్తం రూ.18,000 ఖర్చులకు పోగా ఒక బస్తాకు రూ.1900 వ్యాపారులకు మిగులుతుందన్నారు.మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జీడి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లాలో 70వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారని, సుమారు 80వేల మందికి పైగా రైతులు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. నాన్ షెడ్యూల్ గిరిజన, తీర ప్రాంతంలో నీటి వనరులు లేని మెట్ట ప్రాంతంలో జీడి పంట ప్రధానమైన వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారన్నారు.జీడి రైతుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, భాస్కర్‌రావు, దేముడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోటేశ్వరరావు


పనులు ప్రారంభిస్తున్న డిఇ

కాలువ పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల: తాండవ కాలువ పూడిక తీత పనులు ప్రారంభించినట్లు డిఈ అనురాధ తెలిపారు. కొత్తూరు నుండి జిల్లేడుపూడి వరకు రూ.12.4 లక్షలు మంజూరు కావడంతో శనివారం రెండవ కాలవ చైర్మన్ సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభోత్సవ పనులు చేపట్టారు, ప్రధానంగా మండలా నికి నీరు చేరుకోవడానికి ఈ ప్రాంతంలో పూడిక ఎక్కువగా ఉండటంతో రైతుల ఇబ్బందులు ఎదుర్కొనేవారని, రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు ఇబ్బంది పడకుండా దీనిపై దృష్టి సారించినట్లు చైర్మన్ తెలిపారు. అదేవిధంగా అభివృద్ధి పనులకు 1.26 కోట్లతో పది పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వైస్ చైర్మన్ జోగిరాజు, డైరెక్టర్ పుల్లయ్య, టిడిపి నాయకులు భాస్కరరావు, ఏఇ శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండల పరిషత్ నుంచి విడుదలైన రూ.5లక్షల నిధులతో టి.అర్జాపురం శివారు చిలకవాణిపాలెంలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు వైస్ ఎంపీపీ మత్సభవాని ప్రసాద్, సర్పంచ్ మడగల అర్జున శనివారం భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక గంధం కన్నంనాయుడు ఇంటి వద్ద నుంచి ఎంపీపీ స్కూల్ మీదుగా మత్స అర్జున ఇంటి వరకు సీసీ డ్రెయిన్ నిర్మిస్తున్నా మన్నారు. గత కొంత కాలంగా డ్రెయిన్ పూడికపోయి వర్షం వస్తే నీరంతా రోడ్డు పైకి చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లు తుందన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ఎంపీటీసీ నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజన రాము నాయుడు, అప్పలనాయుడు, అద్దేపల్లి రమేష్‌నాయుడు, మత్స అర్జున పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న నేతలు


చెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే బండారు

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- మాడుగుల:ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరితే ఆ కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుందని శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు.. మండలంలోని కెజె పురం గ్రామానికి చెందిన పుట్ట వరలక్ష్మికి రూ. 1,62,000, ఎండపల్లి చిన్న ఆచారికి 1,53,930, వమ్మలి గ్రామానికి చెందిన ధర్మవరపు ప్రసాద్‌కు 1,20,528, మాడుగుల గ్రామానికి చెందిన బంటు పుష్పకి 25,800లు మండలంలో 9 మందికి 7,04,122 రూపాయలు చెక్కులను బాధితులకు చోడవరం టిడిపి క్యాంప్ కార్యాలయంలో శాసనసభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలంలో పి పొన్నవోలు వద్ద శనివారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. పలువురు పై కేసు నమోదు చేశామని కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనం పై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. లైసెన్స్ లేనివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- మాడుగుల:మహిళలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఇరుట నరసింహమూర్తి డిమాండ్ చేశారు.శనివారం మండలంలో శంకరం పంచాయతీలో సిపిఎం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామిలు అమలు చేయాలని నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత బస్సు, నేలకి 1500, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు ఇస్తామని హామీలు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గిన్నెపల్లి దేవుడమ్మ, సొలం దేవుడమ్మ, ఎర్రయమ్మ, చిన్నమ్మలు పాల్గొన్నారు.

10న జనసేన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని గొడిచెర్లలో ఈనెల 10వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేష్ సమావేశం ఏర్పాటు చేయు ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈనెల 14న పిఠాపురం చిత్రాడలో జరిగే ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేసేందుకు ఈ సమావేశంలో చర్చించనున్నామని, 20 మంది జనసేన శాసనసభ్యులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

రారండోయ్ వేడుక చూద్దాం...

-నేడు ఉపమాక, వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం


ఉపమాకలో ముస్తాబైన వెంకన్న ఆలయం

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఈనెల 9వ తేది నుంచి 17 వ తేది వరకు 9 రోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలు జరగనున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి స్వామి వారి కల్యాణం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. 10న సోమవారం అర్ధరాత్రి శ్రీదేవి, భూదేవి సమేత స్వామి కల్యాణం శాస్త్రయుక్తంగా అర్చక స్వాములు నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా టిటిడి అధికారులు చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.

ఉత్సవాల షెడ్యూల్:

ఈనెల 9వ తేది ఆదివారం ఉత్సవాలు ప్రారంభ సూచికంగా ముహూర్తమును అనుసరించి గ్రామ తిరువీధిలో ఉత్సవ కావిడితో అర్చక బృందం ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. సాయంత్రం పుట్టమన్ను కార్యక్రమం, అనంతరం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులతో అశ్వవాహనంపై తిరువీధి సేవ నిర్వహిస్తారు. 10 వ తేదీ సోమవారం ఉత్సవాల్లో ఈరోజు ప్రత్యేకం. ఆలయంలో మధ్యాహ్నం 11.45 నుండి 12.45 గంటల వరకు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రి తిరువీధిలో రథోత్సవం, ఆలయ కల్యాణ వేదిక వద్ద అంగరంగ వైభవంగా స్వామి కల్యాణమహోత్సవము జరుగుతుంది. 11న ఉదయం నుంచి సర్వ దర్శనాలు, రాత్రికి హంస వాహనంపై తిరువీధి సేవ, 12న రాత్రి ఆలయం వద్ద సదస్యం (పండిత సభ), తిరువీధి సేవ, 13న తోటోత్సవం.(సి. హెచ్. లక్ష్మిపురం) గ్రామ సమీపంలోని ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంలో తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి గజవాహనంపై తిరిగి సేవ 14 న (చక్రవారి స్నానం) రాజయ్యపేట సముద్రతీరానికి స్వామివారి ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంలోకి తీసుకువెళ్లి సముద్రంలో చక్ర వారి స్నాన మహోత్సవం నిర్వహిస్తారు. రాత్రికి రథోత్సవం, 15,16,17 వ తేదిల్లో పుష్పయాగోత్సవం నిర్వహిస్తారు. దీంతో వార్షిక కళ్యాణోత్సవాలు ముగుస్తాయి.

స్వామి వార్షిక కళ్యాణోత్సవాలు సందర్భంగా 18 రోజుల పాటు ఉపమాకలో తీర్థం జరుగుతుంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిల్లర వ్యాపారులు ఇక్కడ తాత్కాలింగా కమ్మలు పాకలు వేసుకుని దుకాణాలు ఏర్పాటుచేసుకుని పలు వ్యాపారాలు చేసుకుంటారు. చిన్న చిన్న బొమ్మలు దుకాణాలతోపాటు, తోపుడు బండ్లు, మిఠాయి కొట్టులు తీసుబండరాలు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మసాలా దినిసులు వ్యాపారం ఇక్కడ ప్రత్యేకం.

టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

స్వామి వారి కల్యాణోత్సవాలు సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలో ఆలయం వద్ద పలు ఏర్పాట్లు చేపట్టారు .ఆలయం లోపల క్లాత్ డెకరేషన్, పరిసర ప్రాంతాల్లోనూ, నక్కపల్లి నుండి ఉపమాక వరకు, మాడవీధుల్లోనూ విద్యుద్దీకరణ చేపట్టారు. స్వామి కల్యాణం తిలకించేందుకు కళ్యాణ వేదిక ను క్లాత్ తో డెకరేషన్ తో అందముగా ముస్తాబు చేశారు. భక్తులు వేచివుండేందుకు తాత్కాలికంగా భారీ షెడ్ ఏర్పాటుచేసారు.

ఏర్పాట్లు పూర్తి

స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాలకు సంబంధించి టిటిడి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు తెలిపారు. 9 నుండి 17వ తేదీ వరకు స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తామని, 9వ తేదీన అంకురార్పణతో స్వామివారి ఉత్సవాలకు శ్రీకారం చుడతామని, 10న స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వడ్డాదిలో ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి వడ్డాది:ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది శ్రీ వెంకటేశ్వర స్వామి 152వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 9వ తేదీన ఆదివారం స్వామివారికి అంకురార్పణ ధ్వజ రోహణ, దొంగ పెళ్లి, 10న ఏకాదశి సందర్భంగా పూజలు, గజ గరుడ వాహనంపై శ్రీవారు అమ్మవార్ల తిరువీధి ఉత్సవాలు, రాత్రికి స్వామివారి తిరు కళ్యాణోత్సవం జరుగును. 11న మంగళవారం ప్రత్యేక పూజలు, 12న హెూమాదికములు, తిరువీధి సేవ, 13న ప్రత్యేక పూజలు, 14న పూర్ణహుతి, నాగవల్లి వసంతోత్సవములు, 15న రాత్రి 10 గంటలకు పుష్పాంజలి సేవ కార్యక్రమాలతో ముగుస్తాయని తెలిపారు


ముస్తాబైన ఆలయం

స్థల పురాణం

ఈ ఆలయానికి ఎంతో ఘన చరిత్ర ఉంది 153 ఏళ్ల క్రితం శ్రీ నారాయణ బజ్ అనే యోగి వచ్చి వడ్డాదికి దక్షిణ దిశగా వెంకటేశ్వర స్వామి నెలకొల్పు పడతారని అది పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుందని చెప్పి దేశ సంచారం నిమిత్తం వెళ్లిపోయారు. యోగి వెళ్లిన మరుసటి ఏడాదే గిరిజంబగిరికి ఉత్తరా దిశగా ఉన్న విజయరామరాజుపేట లో కాళ్ల వంశస్థులు బావిని తవ్వుతుండగా 10 అడుగుల లోతులో వెంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవి విగ్రహాలు, లభ్యమయ్యాయి ఈ విషయాన్ని అప్పటి గ్రామ పెద్దలు దొండా భగవంతులయ్య దొరకు తెలియజేయడంతో విగ్రహాలను వడ్డాది గిరిజంబుగిరికి తప్పించి దేవాలయ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ట చేయించారు ఆనాటి నుండి నేటి వరకు ప్రతి ఏటా స్వామికి కళ్యాణం ఉత్సవాలు నిర్వహిస్తున్నారు దేవాలయ నిర్వహణకు 60 ఎకరాల మాగాన్ని విరాళంగా ఇచ్చారు 1970లో ఆలయ దేవదయ శాఖ ఆధీనంలోకి వెళ్ళింది. ఈ స్థలానికి మహాభారత కాలం నాటి ఘటనలతో సంబంధం ఉన్నట్టుగా సింహాచలం దేవస్థానం ప్రచూరణలో పేర్కొన్నారు. మహాభారతంలో పాండవులు అజ్ఞాతవాసంలో విరాటరాజు పాలించిన మత్య దేశ రాజధాని విరాటపురమే నేటి వడ్డాది అని తెలుస్తుంది పాండవులు గిరిజాంబగిరిని అనుకొని ఉన్న చెరువులో స్నానం ఆచరించి సంధ్య వందనం చేసేవారని కనుకనే ఈ చెరువును పాండవుల చెరువుగా పిలుస్తారని తెలుస్తుంది

ఉత్సవాలో భక్తుల కి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసామని వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు కార్యనిర్వాన అధికారి శర్మ తెలిపారు కొండ దిగున శ్రీ వెంకటేశ్వర వర్తక సంఘం ఆధ్వర్యంలో వడ్డాది జంక్షన్లో ప్రతిరోజు రెండు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు గొల్ల వీధి రోడ్లోనూ ఉచిత అన్నదానం కార్పాట్లు చేసామని అన్నారు.